క్లుప్తంగా

మదుగులమ్మ ఆలయం వద్ద భారీ అన్నదానం



వడ్డన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సామర్లకోట: మండల పరిధిలో హుస్సేన్‌పురం గ్రామంలో వేంచేసి యున్న మదుగులమ్మ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. బుధవారం ప్రారంభమైన జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగియడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని నాగరాజు, చల్లా కొండ తదితరులు అన్నదానంలో భక్తులకు సేవలందించారు.

ఆంజనేయస్వామి ఆలయానికి టీవీ బహూకరణ



ఎ.మల్లవరంలో ఆంజనేయస్వామి ఆలయానికి టీవీ బహూకరిస్తున్న దాత అప్పలరాజు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయానికి స్థానిక రిటైర్డ్ వీఆర్‌ఓ గవిరెడ్డి అప్పలరాజు టెలివిజన్ (టీవీ)ను బహూకరించారు. అప్పలరాజు తన సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన టీవీని స్థానిక టీడీపీ నాయకులు లెక్కల రాము, గవిరెడ్డి గురునాథ్, లెక్కల జోగిబాబు తదితరులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో , పోలుపర్తి అప్పలనాయుడు, కాళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



వేలంకలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కిర్లంపూడి: మండలంలోని వేలంకలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా హనుమాన్ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగుకు సన్నద్ధం

- రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు సిద్ధం
- మండలంలో 22,250 ఎకరాల్లో వరిసాగు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు





పీబీ దేవంలో బోరు ఆధారిత పొలంలో దమ్ములు చేస్తున్న రైతులు. (అంతరచిత్రం) పీబీ దేవంలో వరి నారు మళ్లు

సామర్లకోట: రుతు పవనాల ఆగమనంతో రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలో 22,250 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేయడానికి అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ నెల పదో తేదీ తరువాత గోదావరి కాలువకు నీరు వచ్చే అవకాశం ఉండడంతో ఇప్పటికే కురిసిన వర్షాలతో రైతులు దుక్కి దున్ని, దమ్ములు చేసుకొంటున్నారు. బోర్ల ఆధారంగా వ్యవసాయం చేసే రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. ఈ మేరకు మండల పరిధిలో 500 ఎకరాలకు సంబంధించి నారు వేశారు. ఇప్పటికే వ్యవసాయాధికారులు వరి విత్తనాలను సిద్ధం చేశారు. పీబీ దేవం, జి.మేడపాడు గ్రామాల్లో వరిసాగుకు సంబంధించి నారు మళ్లు తయారు చేసుకున్నారు.

ఆర్బీకేల్లో విత్తనాలు సిద్ధం..

మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో 75 క్వింటాళ్ల స్వర్ణ విత్తనాన్ని, ఐదు క్వింటాళ్ల 1318 రకం విత్తనాన్ని సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే మండల పరిధిలో పీబీ దేవం, జి.మేడపాడు గ్రామాల రైతులు విత్తనాలు తీసుకున్నారు. వేట్లపాలెం నుంచి పవర వరకు ఉన్న 16 గ్రామాల్లో రైతులు పొలం పనులు ప్రారంభించాల్సి ఉంది. వీరి కోసం విత్తనాలను ఆయా ఆర్బీకేల్లో సిద్ధంగా ఉంచారు. 30 కిలోల బస్తా రూ.1.045కు రైతులకు విక్రయిస్తున్నారు.

బోర్ల కింద సాగుకు నారుమళ్లు..



బోర్లు ఉన్న రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్నారు. గోదావరి కాలువకు నీరు విడుదలైతే మండల పరిధిలో ప్రథమంగా పీబీ దేవం గ్రామానికే సాగునీరు వస్తుంది. పాడి రైతులు నారు వేసి ఆకుమళ్లతో కూలీల సాయంతో వరినాట్లు వేసుకుంటారు. గ్రామంలో అన్నపూర్ణ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 750 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

– తోటకూర సూర్యప్రకాశరావు, రైతు, పీబీ దేవం

వెదజల్లు పద్ధతికే ప్రాధాన్యం



మండల పరిధిలో 22,250 ఎకరాల్లో ఖరీఫ్‌లో సన్న రకాలు సాగు చేస్తున్నారు. 95 శాతం వరకు వెదజల్లు పద్ధతిలోనే సాగు ఉంటుంది. దాంతో వ్యవసాయ ఖర్చు తగ్గుతుంది. రైతుల అవసరాల మేరకు స్వర్ణ, 1318 రకం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. కేజీకి రూ.ఐదు సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నాం. ప్రస్తుత సీజన్‌లో రైతులు పండించిన విత్తనాలే ఎక్కువగా కొనుగోలు చేసే అవకాశం ఉంది.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

13న మండల సమావేశం

గొల్లప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎ.విజయ ప్రకాష్‌రావు ఆదివారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశం అనంతరం మండల కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ముగిసిన జట్లమ్మ జాతర



పూజలందుకుంటున్న జట్లమ్మ తల్లి

పెద్దాపురం: మండల పరిధిలోని దివిలి జట్లమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఆలయ నిర్వాహకులు నరాల శెట్టి బాబ్జీరావు ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

హిందూ ధర్మ పరిరక్షణలో కానుగోవి కృషి అద్వితీయం

బోట్‌క్లబ్: హిందూ ధర్మ పరిరక్షణకు రాచూరి రాఘవేంద్రస్వామి ఎంతో పాటుపడ్డారని ఉత్తరాదిమఠ ప్రత్యేక అధికారి సుధా పండితులు కానుగోవి వాసుదేవాచార్ అన్నారు. కాకినాడ మధ్వ సభ కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్ర స్వామి సంతాప సభ ఆదివారం కందాలం నరసింహారావు అధ్యక్షతన జరిగింది. వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసి సుమారు వెయ్యి మందికి పైగా వివాహాలు జరిపించారన్నారు. రాచూరి మరణం తీరని లోటన్నారు. సుధా పండితులు సుమంత్ ఆచార్ పాటిల్ మాట్లాడుతూ గురువుల ఆశయాలకు అనుగుణంగా ఆలోచించడమే కాక వాటి ఆచరణలో కూడా అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా కీర్తించారు. పండితులకు సముచిత ప్రాధాన్యం కల్పించడంలో శ్రద్ధ తీసుకునేవారన్నారు. కార్యక్రమంలో మధ్వ పురోహితులు యతగిరి మద్వేష్, కమిటీ కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, లోక రాఘవేంద్రరావు, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల్లో నేర ప్రవృత్తి ఆందోళనకరం

కాకినాడ రూరల్: బాలల్లో పెరుగుతున్న నేర ప్రవృత్తి ఆందోళనకరమని న్యాయవాది రాణి ఆవేదన వ్యక్తం చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నేడు ఒంటరి కుటుంబాలు ఏర్పడడంతో పిల్లలపై తల్లిదండ్రుల అజమాయిషీ తగ్గి, దురాలవాట్లకు లోనవుతున్నారన్నారు. సిగరెట్లతో మొదలై గంజాయి వంటి వాటికి అలవాటు పడుతుండడంతో నేర ప్రవృత్తి పెరిగిపోతోందని, తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఓటమిని గౌరవంగా స్వీకరిద్దాం
- కార్యకర్తల సమావేశంలో దవులూరి



నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, పార్టీ నాయకులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో, అండగా ఉంటానని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఓపికగా ఉండాలన్నారు. అధికారం బలం పేరుతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి కేసులలో ఇరికించే ప్రయత్నాలు జరుగుతాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి తన జీవిత కాలం అండగా ఉంటానని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న కాలంలో ఎవరిపైనా కేసులు పెట్టలేదని, ఏ పార్టీ నాయకులను రెచ్చగొట్టలేదని ఆయన గుర్తు చేశారు. పార్టీ రహితంగా సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల జోలికి వస్తే ఉరుకునేది లేదన్నారు. గెలుపు ఓటములు సహజమని అన్నారు. స్థానిక సంస్థల పాలనలో ప్రజలకు మంచి పాలన అందించి రాబోయే ఎన్నికల్లో విజయానికి పునాది వేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడవలసిన పని లేదన్నారు. ఎన్నికల్లో ఏం జరిగిందో ప్రజలకే తెలుస్తుందని చెప్పారు. ప్రజల కష్టాలను తెలుసుకుని వారి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఎంపీపీ అత్తిలి వెంకట సీతారామస్వామి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్మోహన్‌రెడ్డి మంచి సంక్షేమ పాలన అందించారని, అయినా ఓటమి తప్పలేదని అన్నారు. అయితే కూటమి ఇచ్చిన హామీలపై దృష్టి సారించి వాటిని అమలు చేయక పోతే ప్రజలకు అండగా ఉండి పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు వారికి ఆరు నెలలు వ్యవధి ఇద్దామన్నారు. టీడీపీ నాయకులు రెచ్చగొడితే ఓరిమిగా ఉండాలన్నారు. కేసులలో ఇరికించే ప్రయత్నాలు జరుగుతాయని హెచ్చరించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ పెద్దాపురం పార్టీ నాయకులపై దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలలో ఏక పక్షంగా విజయం సాధించినా ప్రతిపక్షాల నాయకులపై ఒక జువ్వ కూడా వేయలేదని ఆయన గుర్తు చేశారు. వారి పాలనపై ప్రజలు తెలుసుకునే వరకు వేచి ఉండాలన్నారు. సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు జగన్‌మోహన్ రెడ్డి పాలనలో న్యాయం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే అన్నవరం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యురాలి పదవి తన భార్యకు లభించిదన్నారు. ఈ కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, దొరబాబు సతీమణి చంద్రకళ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా పరిషత్తు విభాగం చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, గోకిన సునేత్రాదేవి, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పెద్దాపురం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వినుకొండ విష్ణుచక్రం, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏలేరులో తగ్గిన నీటి నిల్వలు



ఏలేరులో అడుగంటిన నీటినిల్వలు

ఏలేశ్వరం: వేసవి నేపథ్యంలో స్థానిక ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరాఫరా అంతంతమాత్రంగా ఉండడంతో జలాశయంలో నీటినిల్వలు తగ్గుతున్నాయి. ఆదివారం నాటికి జలాశయంలో రూ.86.56 మీటర్లకు గాను 68.58 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.61 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దిగువ ప్రాంతంలో పంటసాగు లేకపోవడంతో ఆయకట్టుకు నీటి విడుదలను నిలిపివేశారు. విశాఖకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజుచెరువుకు సైతం నీటి సరాఫరాను నిలిపివేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వాకతిప్పలో 24 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 24 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 24 సంవత్సరాల క్రితం విద్యను బోధించిన తమను గుర్తు పెట్టుకుని సత్కరించడం గొప్ప విషయమన్నారు. ఈ ఆత్మీయ కలయికకు కృషిచేసిన శ్రీదేవి, తిరుమలరావు, గోపాలరావు, గేరి, శేషగిరిరావులను ఉపాధ్యాయులు అభినందించారు.

డీఎస్ఏ.. క్రీడా కార్ఖానా..

- వేసవి శిబిరాల పేరుతో క్రీడాకారులకు శిక్షణ
- వేల సంఖ్యలో విద్యార్థులకు తర్ఫీదు
- బాల్యం స్మార్ట్ ఫోన్‌కు బానిస కాకుండా అభిరుచి ఉన్న క్రీడలో మెరికల్లా తయారు
- రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలకు సన్నద్ధత



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్మార్ట్ ఫోన్ ప్రపంచంలో ఆటపాటలు, క్రీడలు కనుమరుగైపోయాయి. కాకినాడలో మాత్రం వేసవిని ఆహ్లాదకరంగా మారుస్తూ వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు 20 ఏళ్లుగా కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో ఏటా వేసవిలో క్రీడాశిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను వివిధ క్రీడల్లో తీర్చి దిద్దుతున్నారు. ఈ ఏడాది నిర్వహించిన వివిధ శిబిరాల్లో సుమారు 2000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారంతో ఈ శిబిరాలు ముగియనున్నాయి.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏటా డీఎస్ఏతో పాటు, జిల్లాలో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది ఎన్నికలు మే నెలలో జరగడంతో కేవలం డీఎస్ఏలో మాత్రమే శాప్ ఆదేశాల మేరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు వేసవి శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయి. ఈ శిబిరాలకు తమ పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నారు. వందల సంఖ్యలో విద్యార్థులు ఈ శిబిరాల్లో శిక్షణ పొంది తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకున్నారు.

ఉదయం 6 గంటల నుంచే...

సాధారణంగా సెలవులు వచ్చాయంటే ఎక్కువ శాతం మంది పిల్లలు మైదానాలు, ఖాళీ స్థలాల్లో క్రికెట్ ఆడుతూ కనిపిస్తారు. కానీ జిల్లా క్రీడామైదానంలో మాత్రం ఆయా క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తాం. ఉదయం 6 గంటల నుంచే విద్యార్థులు మైదానానికి భారీగా చేరుకుంటారు. ఈ శిక్షణ 9 గంటల వరకు ఉంటుంది. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు కొనసాగుతుంది. ఏటా 30 రోజులు శిక్షణ ఇచ్చేవారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో మే 15 నుంచి జూన్ 10 వరకు కొనసాగుతాయి. క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నారు. వందలాది సంఖ్యలో విద్యార్థులు ఈ శిబిరాల్లో వారికి అభిరుచి ఉన్న క్రీడల్లో తర్ఫీదు పొందుతున్నారు. క్రీడలతో విద్యార్థి దశ నుండే ఆలోచనా శక్తి పెరగడంతో పాటు వారిలో సృజనాత్మక శక్తి మెరుగుపరచేందుకు వీలుగా శిక్షణ అందిస్తున్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో నైపుణ్యం కల్గిన క్రీడాకారులను గుర్తించి వారికి ఏడాడి పొడవునా శిక్షణ ఇచ్చి మెరికెల్లా తయారు చేసి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు.

వేసవి శిక్షణతో నైపుణ్యం మెరుగు

విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడానైపుణ్యాలు మెరుగుపరచేందుకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు దోహదపడతాయి. అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో సుమారు 13 క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. వేసవి శిక్షణ శిబిరాలు ముగిసినా, నిరంతర శిక్షణకు చేరవచ్చు. ఆసక్తి గల వారు 89196 42248 నెంబరులో సంప్రదించవచ్చు.

– బి.శ్రీనివాస్‌కుమార్, డీఎస్‌డీఓ, కాకినాడ డీఎస్ఏ



జిల్లా క్రీడా మైదానంలో క్రికెట్‌లో మెళకువలు నేర్పుతున్న కోచ్‌లు




హాకీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



అథ్లెటిక్స్‌లో భాగంగా చిన్నారుల లాంగ్ జంప్

ప్రయాణం.. ఆహ్లాదకరం



తుని-ఎన్.చామవరం రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు

తుని రూరల్: రహదారికి ఇరువైపులా చెట్లు. ఆ చెట్ల నుంచి వీచే చల్లని గాలులతో తుని నుంచి ఎన్.చామవరం మీదగా హంసవరం వెళ్లే రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతోంది. ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారులకు ఇరువైపులా వివిధ రకాల మెక్కలను పెంచింది. ఆ మొక్కలు పెరగడంతో రహదారులు ఆహ్లాదకరంగా మారాయి. ఈ రహదారితో పాటు డి.పోలవరం శివారు అశోక్ నగర్ గండి నుంచి దొండవాక, కేఓ మల్లవరం–లోవ కొత్తూరు చెరువు గట్టు నుంచి రాజుపేట వరకు ఇలా రహదారులు ఆహ్లాదంగా ఉన్నాయి. వేసవిలో ఆ రహదారుల్లో వెళ్లే ప్రయాణికులకు ఎండ నుంచి ఉపశమనం పొందడంతో పాటు చెట్లకింద కొంతసేపు ఆగి సేదతీరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అవగాహన రాహిత్యంతో వేసిన మొక్కలు పెరిగి విద్యుత్ లైన్లకు తాగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో కళాహీనంగా మారుతున్నాయి.